సాక్షి ఒడిశా

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,00,825లు, బంగారం 10 మిల్లీగ్రాములు, వెండి 53 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఎదురొచ్చిన మృత్యువు

గ్యాస్ బండిని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. మరో యువకుడు గాయపడ్డాడు.

- 8లో



కల్యాణ వైభోగమే..

పర్లాకిమిడి పొడుగు కోవెలలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

- 8లో

శివోహం



మహా శివ రాత్రి పర్వదినాన్ని భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. బుధవారం వేకువజాము నుంచే శివాలయాలకు వెళ్లి అభిషేకాలు, అర్చనలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మారుమోగాయి. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా మహేంద్ర గిరుల్లో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లాయి.

– సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: లింగరాజు మహా ప్రభువు దర్శనం కోసం ఏకామ్ర క్షేత్రంలో బారులు తీరిన భక్త జనం



భువనేశ్వర్: జాజ్‌పూర్ ఉత్తరాది వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఏకాదశ రుద్రాభిషేకం



కొరాపుట్‌లో కలెక్టర్ వి.కీర్తి వాసన్ దంపతులు పూజలు



మల్కన్‌గిరి: పూజాలందుకుంటున్న మల్లికేశ్వరుడు



భువనేశ్వర్: లింగరాజు దేవస్థానం ఆవరణలో బీఎంసీ ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాల సముదాయం



జయపురం: పూర్ణఘడ్ నీలకంఠేశ్వర ఆలయంలో దీపారాధన



కొరాపుట్: హోమం చేస్తున్న కొరాపుట్ జిల్లా పొట్టంగి ఎమ్మెల్యే రాంచంద్ర ఖడం



కొరాపుట్: యజ్ఞశాల వద్ద నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి



మల్కన్‌గిరి:కొండపైకి చేరుకుంటున్న భక్తజనం



కొరాపుట్: ఉమ్మర్‌కోట్‌లో శివుని సేవలో మంత్రి నిత్యానంద గొండో దంపతులు



మల్కన్‌గిరి: నంది వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



పర్లాకిమిడి: మహేంద్రగిరికి విచ్చేసిన బరంపురం ఎంపీ డా.ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి



పర్లాకిమిడి: సోండివీధి శ్రీబలుంకేశ్వర స్వామి ఆలయంలో..



జయపురం: గుప్తేశ్వర్‌లో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తజనం



జయపురం: గుప్తేశ్వర్‌లో పోటెత్తిన భక్తజనం



పర్లాకిమిడి: పొడుగుకోవెలలో మహాశివ రాత్రి దీపోత్సవం



పర్లాకిమిడిసీతాసాగరం మల్లికార్జున స్వామి మందిరంలో అభిషేకాలు



జయపురం : గాంధీ చౌక్‌లో శివునికి పూజలు చేస్తున్న భక్తులు



రాయగడ: విద్యుత్ వెలుగుల్లో బాలింకేశ్వర మందిరం



రాయగడ: చాటికొనలోని పాతాళేశ్వరమందిరం వద్ద భక్తులు



పర్లాకిమిడి:శ్రీరామలింగేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ



పర్లాకిమిడి: ఎం.ఆర్.బి.హెచ్.బాయ్ స్కౌట్స్ ఆధ్వర్యంలో అల్పాహారం వితరణలో ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి

విచారణ ఖైదీ అనుమానాస్పద మృతి

- హత్య చేశారంటూ కుటుంబికుల ఆందోళన

భువనేశ్వర్: కటక్ జిల్లా ఖుంటుని ప్రాంతంలో విచారణలో ఉన్న ఖైదీ అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఇది ముమ్మాటికీ హత్యేనని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు రోడ్డు దిగ్బంధనం చేశారు. వీరి ఆందోళనకు స్థానికులు మద్దతు ప్రకటించారు. ఆందోళనతో జనజీవనానికి అంతరాయం కలిగింది. ఆదర్శ్ జైలులో నేరారోపణ విచారణ ఖైదీగా ఉన్న మహమ్మద్ తయాబ్ బుధవారం చనిపోయాడు. మృతుడు కటక్ పంకల గ్రామానికి చెందిన మహమ్మద్ తయాబ్‌గా గుర్తించారు. ఈ విచారకర సంఘటన పై ఆగ్రహించిన గ్రామస్తులు ఖుంటుని, నర్సింగ్‌పూర్ మార్గంలో రోడ్డును దిగ్బంధించారు. మహమ్మద్ తయాబ్‌ను హత్య చేశారని మండిపడ్డారు. మంగళవారం రాత్రి ఖైదీ మహమ్మద్ తయాబ్ అనారోగ్యానికి గురికావడంతో జైలు సిబ్బంది హుటాహుటిన చికిత్స కోసం చేరువలో ఉన్న అఠాగొడా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించడంతో వివాదాస్పదంగా మారింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు భారీగా తరలివచ్చి హత్య చేశారంటూ ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న టిగిరియా ఠాణా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో చర్చించి మహ్మద్ తయాబ్ మరణంపై పారదర్శకంగా న్యాయసమ్మతమైన దర్యాప్తు చేపడతామని నచ్చజెప్పి ఆందోళనకారులను శాంతింపజేయడంతో ఆందోళనను విరమించారు.



ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు



వాహనాలను అడ్డుకున్న ప్రజలు



ప్రధాన కూడలి ప్రాంతంలో టైర్లు కాల్చి నిరసన తెలియజేస్తున్న ఆందోళనకారులు

28న చలో పోలవరం



మాట్లాడుతున్న బీజేడీ నేతలు

మల్కన్‌గిరి : ఈ నెల 28న చలో పోలవరం కార్యక్రమం నిర్వహిస్తున్న బీజేడీ నేతలు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం మల్కన్‌గిరిలో పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రాజెక్ట్ పూర్తయితే మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు ప్రాంతంలో 12 పంచాయతీలు నీట మునిగిపోతాయని చెప్పారు. సుమారు ఐదు వేల మంది నిరాశ్రయులవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ సర్కారుకు రూ.15 వేల కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టును అడ్డుకునేందుకు చేపడుతున్న చలో పోలవరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నవరంగ్‌పూర్ మాజీ ఎంపీ రమేశ్ మాఝి, మాజీ ఎంపీ ప్రదీప్ మాఝి, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే మనాస్ మడ్కమి, 14 ఆదివాసీ సంఘాల కార్యకర్తలు, జిల్లా బీజేడీ సభ్యులు ప్రభాకర్ ప్రధాన్, గోపాల పండా, గణశ్యామ్ మడ్కమి, జరా శభర్ మాఢి, బంధు ముదిలి, ప్రీత్‌పాల్ సింగ్ పాల్గొన్నారు.

ధాన్యం దొంగిలించిన కేసులో ఐదుగురు అరెస్టు



స్వాధీనం చేసుకున్న ధాన్యం బస్తాలు

జయపురం: స్థానిక హటపాదర్‌లోని సకుంతలా, కృష్ణారావుల ధాన్యం మిల్లులో 160 బస్తాల ధాన్యం చోరీకి గురైనట్టు భూపతి వీధి నివాసి ఎ.పవన్ కుమార్ ఈ నెల 24వ తేదీన ఫిర్యాదు చేశారని జయపురం పట్టణ పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర చంద్రతండి బుధవారం తెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఐదుగురిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో హటపాదర్ నివాసి సిమితి ఖొర, అజయ హరిజన్, మున బెనియ, పూర్ణఘడ్ ఉప్పరసాహి లొబ భైరాగిలతోపాటు ఒక మైనర్ బాలుడు ఉన్నట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి 140 బస్తాల ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పోలీసు అధికారి ఈశ్వర తండి చెప్పారు. నిందితులు మిల్లులో ధాన్యం బస్తాలు దొంగిలించి గాంధీ చౌక్ సమీప కెనాల్ రోడ్డులో దాచినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నలుగురిని కోర్టులో హాజరు పరిచామన్నారు. మైనర్ బాలుడిని జువైనల్ బోర్డు ముందు హాజరుపరచినట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతుందన్నారు.



అరెస్టయిన నిందితులతో పోలీసులు

క్లుప్తంగా

ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితిలోని ఆశ్రమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని శిశువును ప్రసవించింది. దీంతో అధికారులు చర్యలు ప్రారంభించారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి సంఘటన చోటుచేసుకుందని గుర్తించారు. ఆశ్రమ పాఠశాల హెడ్‌మాస్టార్ అజిత్ కుమార్ మడ్కమి, ఏఎస్ఎం కవిత కుమారి పాత్రోను బుధవారం సస్పెండ్ చేయగా.. హాస్టల్ వార్డెన్ సుచిత్ర చర్షితను డిస్మిస్ చేశారు. వీరి నిర్లక్ష్యంతోనే ఈ దారుణం చోటుచేసుకుందని జిల్లా యంత్రాంగం మండిపడింది. విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన చిత్రకొండ సమితి దీసరీ గూడ గ్రామానికి చెందిన యువకుడు సుశాంత్ ఖీలోను చిత్రకొండ ఐఐసీ ముకుందో మేల్కా అరెస్టు చేశారు. అలానే విద్యార్థినితోపాటు తన శిశువును మేరుగైన వైద్యం కోసం కొరాపుట్ ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరు అరెస్ట్



నిందితులు సిమన్ కుంజారియ, ప్రబీర్ హారిజన్

జయపురం: జయపురంలోని విజ్ఞాన ఇంటర్ నేషనల్ స్కూల్ ఉపాధ్యాయునిపై దాడి చేసి తీవ్రంగా కొట్టి, దూషించిన ఇరువురిని అరెస్ట్ చేసినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి ఈశ్వర తండి బుధవారం వెల్లడించారు. ఉమ్మరి తొళసాహి ప్రబీర హరిజన్ ఉరఫ నాగ్(19), మొకాపుట్ గ్రామానికి చెందిన సిమన్ కుంఝారియ(20) అని వెల్లడించారు. వీరు పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థుల బంధువులన్నారు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం ఇద్దరు నిందితులు స్కూలులో ఉన్న ఉపాధ్యాయుడు సౌమ్యరంజన్ స్వైయ్‌పై దాడి చేశారన్నారు. తీవ్రంగా గాయపడిన స్వైయ్ ముఖంపైన, పలు చోట్ల గాయాలయ్యాయన్నారు. వీరు పాఠశాలలో ఉన్న మహిళా ఉద్యోగులపై అసభ్యకరంగా ప్రవర్తించి, మిగతా వారిని చంపుతామని బెదిరించారన్నారు. ఇవి అన్నీ సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయన్నారు. ఈ సంఘటనపై పాఠశాల అధ్యక్షుడు ప్రకాశ్ కుమార్ నాయక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. కోర్టు బైలు ఇచ్చేందుకు నిరాకరించటంతో వారిని జైలుకు పంపినట్లు పోలీసు అధికారి తెలిపారు.

సీబీసీఎన్‌సీ ఆస్తులను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న ట్రస్టు చైర్మన్ ఆర్ఎస్ జాన్

శ్రీకాకుళం కల్చరల్: ది కన్వెన్షన్ ఆఫ్ ది బాప్టిస్టు చర్చస్ ఆఫ్‌ది నార్తన్ సర్కాస్ (సీబీసీఎన్‌సీ) ఆస్తులు పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విజయనగరం సీబీసీఎన్‌సీ ట్రస్టు చైర్మన్ ఆర్.ఎస్.జాన్ అభిప్రాయపడ్డారు. నగరంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. సీబీఎం మిషన్‌కు సోంపేట నుంచి అవనిగెడ్డ వరకు అనేక బాప్టిస్టు సంఘాల పేరిట ఆస్తులను ఉన్నాయన్నారు. 1979లో సీబీసీఎన్‌సీలో వివాదాలు ఏర్పడి అనే సంఘాలుగా విడిపోయాయని గుర్తు చేశారు. దీనిని ఆసరాగా తీసుకొని కొందరు బాప్టిస్టేతరులు ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. భీమిలి బాప్టిస్టు చర్చి ఎదురుగా ఉన్న స్థలాన్ని, విజయనగరంలోని సీబీఎం యూపీ స్కూల్, బొబ్బిలి సీబీసీఎం బాలిక హైస్కూల్ స్థలాల ఆక్రమణకు పాల్పడిన రత్నకుమార్‌ను కరస్పాండెంట్ పదవి నుంచి తొలగించామని చెప్పారు. అదేవిధంగా నౌపడా, కోటబొమ్మాళి స్కూల్స్ స్థలాలను యాకబ్ కబ్జా చేయాలని చూశాడని, దీంతో ఆయనను సంస్థ కన్వీనర్‌గా తొలగించామని పేర్కొన్నారు. అందువలన వారిపై తక్షణమే సీఐడీ కేసు వేసి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

మత విద్వేషాలను అరికట్టాలి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలోని ఇచ్ఛాపురం మండలం డొంకూరు గ్రామంలో మత విద్వేషాలను అరికట్టాలని ఆ గ్రామానికి చెందిన క్రైస్తవులు కోరారు. ఈ మేరకు జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఆర్ఎస్ జాన్‌కు వినతిపత్రం బుధవారం అందజేశారు. కొంతమంది వ్యక్తులు హిందూ, క్రైస్తవుల మధ్య విభేదాలను సృష్టిస్తున్నారని తెలియజేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై స్పందించిన జాన్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని పేర్కొన్నారు.

బుడితిలో ఆటో చోరీ

సారవకోట: మండలంలోని బుడితి బస్టాండ్‌లో మంగళవారం రాత్రి ఆటో చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నేతింటి చలపతి ప్రతీరోజు మాదిరిగానే ఆటోను బుడితి బస్టాండ్‌లో పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం తెల్లవారుజామున వెళ్లి చూసేటప్పటికి ఆటో లేకపోవడంతో చుట్టూ గాలించి సారవకోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై హెచ్‌సీ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కల్యాణ ఘట్టం


కల్యాణ మహోత్సవంలో ఇనపకుర్తి మేళం


కల్యాణాన్ని జరిపిస్తున్న పూజారి

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబల కల్యాణ మహోత్సవం

స్థానిక పొడుగు కోవెలలో మహాశివరాత్రి సందర్భంగా పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా బుధవారం నిర్వహించారు. పర్లాకిమిడి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. కల్యాణ మహోత్సవాన్ని లక్కోజు ఉమ, తణుకు గౌరీశంకర్ దంపతులు జరిపించగా పండితులు వనమాలి మణిశర్మ, ఇనపకుర్తి మేళంతో కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

-పర్లాకిమిడి

పోలవరం ప్రాజెక్టు రగడ

- ఈ నెల 28న ప్రతిపక్ష బీజేడీ నిరసన
- మోటు కేంద్రంగా ఉద్యమం
- నాటకీయ రాజకీయం: బీజేపీ
- ప్రజా ప్రయోజనాలైతే మద్దతు ఇస్తాం: కాంగ్రెస్

భువనేశ్వర్:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చకచకా చేపడుతున్న పోలవరం ప్రాజెక్టు వివాదం నానాటికి రగులుతోంది. రాష్ట్రంలో ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ తీవ్ర ఆగ్రహంతో మరింత వివాదాస్పదమవుతోంది. ఓ వైపు న్యాయ విచారణ కొనసాగుతుండగా ప్రాజెక్టు పనుల్ని యథేచ్ఛగా చేపట్టడం చట్ట వ్యతిరేకమని ఆరోపిస్తుంది. మరోవైపు మల్కన్‌గిరి జిల్లాలో పలు గ్రామాలు నీట మునుగుతాయని ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ప్రధాన ప్రతిపక్షం బిజూ జనతా దళ్ తారస్థాయి ఉద్యమానికి శంకారావం పూరించింది. పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఈ నెల 28న మల్కన్‌గిరిలో బిజు జనతా దళ్ (బీజేడీ) నిరసన ప్రదర్శన చేపట్టనుంది. పోలవరం ప్రాజెక్టుని బీజేడీ వ్యతిరేకించి, తన ఉనికిని పునరుద్ధరించేందుకు తాపత్రయ పడుతుంది. విపక్ష హోదాలో బీజేడీ ఉద్యమం అధికార పక్షం భారతీయ జనతా పార్టీ బీజేపీకి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ పరిస్థితుల్లో బీజేడీ పోలవరం వ్యతిరేక ఉద్యమం నాటకీయ రాజకీయ చర్యగా అధికార పక్షం భారతీయ జనతా పార్టీ వ్యాఖ్యానించింది. ఈ ప్రాజెక్టు ఒడిశాపై ఎటువంటి ప్రభావం చూపదని బీజేడీ వ్యతిరేకతని ఏకపక్షంగా తోసి పుచ్చింది.

ఈ ఆందోళనకు ప్రతిపక్ష నాయకుడు, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ ప్రత్యక్షంగా సారథ్యం వహిస్తున్నారు. ఈ అంశంపై ఆయన వ్యూహాత్మక కార్యాచరణ కోసం ఆచితూచి అడుగు వేయనున్నట్లు బీజేడీ వర్గాలు తెలిపాయి. ఈసారి ప్రతిపక్ష నేతగా నవీన్ పట్నాయక్ ప్రత్యక్షంగా ఉద్యమంలో పాలుపంచుకోవడం రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పక్షాల శిబిరాల్లో చర్చనీయాంశమైంది. మల్కనగిరి జిల్లా మోటు ప్రాంతంలో బీజేడీ పోలవరం వ్యతిరేక ప్రదర్శన జరగనుంది. సంయుక్త క్రియాశీలక



కమిటీ ఆధ్వర్యంలో సంకల్పించిన ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో బిజూ జనతా దళ్ కార్యకర్తలను ప్రేరేపిస్తుంది. నవీన్ పట్నాయక్ సారథ్యంలో ఈసారి ఆందోళన వేడవాడిగా సాగే అవకాశాల పట్ల చర్చ ఊపందుకుంటోంది. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడి మల్కన్‌గిరి ప్రాంతీయుల ప్రయోజనాలకు నీళ్లొదిలి ఆంధ్రప్రదేశ్ వివాదాస్పదంగా పోలవరం ప్రాజెక్టు పనులు చేపడుతుందని బీజేడీ దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభావిత ప్రజల ప్రయోజనాల పరిరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా అఖిల పక్షాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆగడాల్ని అడ్డుకునేందుకు ముందుకు రావాలని ఈ వర్గం పిలుపునిచ్చింది.

కేంద్రం మద్దతుతో ...

ఈ ప్రాజెక్టును వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం గతంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.15,000 కోట్ల భారీ ఆర్థిక సహాయ ప్యాకేజీని మంజూరు చేసింది. దీని ప్రభావంతో ప్రాజెక్టు తీర ప్రాంతీయులైన మల్కన్‌గిరి జిల్లా వాసుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పోలవరం ప్రాజెక్టు వల్ల ఒడిశాపై కలిగే ప్రతికూల ప్రభావాలను బిజు జనతా దళ్ పార్లమెంటులో, రాష్ట్ర శాసన సభలో తరచూ ప్రస్తావిస్తోంది. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా బీజేడీ దీర్ఘకాలంగా ఉద్యమిస్తుందని సీనియర్ నాయకులు గుర్తు చేస్తున్నారు. ప్రతిపాదిత పోలవరం వ్యతిరేక ఉద్యమం కార్యాచరణపై బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ ప్రత్యక్ష పాత్రకు సంబంధించి తుది నిర్ణయం కోసం సర్వత్రా ఉత్కంఠ నెలకొని ఉంది.

బిజూ జనతా దళ్ రాజకీయ జిమ్మిక్కు..

పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుందనే ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. ఈ ప్రాజెక్టు వల్ల మల్కన్‌గిరి జిల్లా కలిమెల, మథిలి వంటి ప్రాంతాలు మునిగిపోవని పేర్కొంది. కాంగ్రెస్ హయాంలో ఈ ప్రాజెక్టును తొలుత రూపొందించారని, ఆ సమయంలో రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేడీ నేతృత్వంలోని ప్రభుత్వం ఎటువంటి వ్యతిరేకత ప్రదర్శించ లేదని దుయ్యబట్టింది. పోలవరం ప్రభావిత ప్రాంతాలపట్ల నవీన్ పట్నాయక్ లోగడ స్పందించని తీరునూ గుర్తు చేస్తోంది. ఆలస్యంగానైన రాష్ట్ర ప్రజల స్వార్థ ప్రయోజనాల పరిరక్షణ కోసం విపక్ష నేత హోదాలో నవీన్ పట్నాయక్ ఉద్యమానికి ప్రత్యక్షంగా సారథ్యం వహిస్తే సానుకూలంగా సహకరిస్తామని కాంగ్రెసు సీనియర్ నాయకులు ఆసక్తి కనబరుస్తున్నారు.

నవీన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టు ప్రారంభమైందని, అప్పుడు నవీన్ బాబు పెదవి కదపలేదు. ఆయన నిరసనలో పాల్గొని రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి పోరాడితే, తాము ఖచ్చితంగా ఆయనకు మద్దతు ఇస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తారా ప్రసాద్ బాహినీపతి స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పోలవరం విషయంలో నవీన్ పట్నాయక్ తీసుకునే చర్యలను బట్టి ఒడిశా రాజకీయ వాతావరణం మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎదురొచ్చిన మృత్యువు

- గ్యాస్ బండిని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- పేలిన బైక్ ట్యాంకర్
- ఇద్దరు యువకుల దుర్మరణం
- తీవ్ర గాయాలపాలైన మరో యువకుడు
- ఒడిశాలో ప్రమాదం.. కవిటి మండలంలో విషాదం


కాలిపోతున్న ద్విచక్రవాహనం

ఇచ్ఛాపురం రూరల్/బరంపురం: ఒడిశా రాష్ట్రం చీకటిపేట రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలానికి చెందిన ఇద్దరు యువకులు మృత్యువాత పడగా, మరో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కవిటి మండలం బెజ్జిపుట్టుగ గ్రామానికి చెందిన తుపాకి రాజు(20), రాజపురం తొత్తిడిపుట్టుగ గ్రామానికి చెందిన పాడియా లక్ష్మణరావు(22), సీహెచ్.నరేంద్రలు స్నేహితులు. రాజు ఇటీవల కొనుగోలు చేసిన బైక్‌పై తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఒడిశా రాష్ట్రం చీకటి పాత్రపురం సమీపంలోని ఓ గ్రామంలో స్నేహితుడి వివాహానికి మంగళవారం వెళ్లారు. అదే రోజు సాయంత్రం ఇంటికి వస్తుండగా


తుపాకి రాజు(ఫైల్)


లక్ష్మణరావు(ఫైల్)

చీకటి రోడ్డులో తాళపడ నోగాం సమీపంలో ఎదురుగా వస్తున్న గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని ఢీకొట్టారు. బైక్ పెట్రోల్ ట్యాంకు ఒక్కసారిగా పేలిపోవడంతో డ్రైవింగ్ చేస్తున్న రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న లక్ష్మణరావు, తీవ్ర గాయాలపాలైన నరేంద్రలను అటువైపుగా వెళ్తున్న వాహనదారులు ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా, లక్ష్మణరావు మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన నరేంద్ర బరంపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజు తండ్రి లోకనాథం మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి


మృతి చెందిన రాజు. గాయపడిన నరేంద్రకు సపర్యలు చేస్తున్న యువకులు

జానకమ్మ, చెల్లిని పోషించుకునేందుకు కవిటిలోని ఓ సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. లక్ష్మణరావు, నరేంద్రల తల్లిదండ్రులు వలస కూలీలు. బరంపురం ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

సదర్ పోలీసు స్టేషన్ అధికారి బాధ్యతలు స్వీకరణ

జయపురం: జయపురం సదర్ పోలీసు స్టేషన్ ఐఐసీ (ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి) అధికారిగా సచింద్ర ప్రధాన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఈశ్వర చంద్రతండి జయపురం పట్టణ పోలీసు అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన ముందుగా నూతన అధికారి సచింద్ర ప్రధాన్‌కు స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. కొత్తగా బాధ్యతలు చేపటిటన అధికారికి ఎస్ఐ రాజకిశోర్ బారిక్, శిరిశ మహాపాత్రో, ఏఎస్ఐ బసంతీ నాయిక్, పంకజనీ శబర, కామాక్ష ప్రసాద్ బిశాయి తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాన్ మాట్లాడుతూ.. జయపురం సదర్ ప్రాంతంలో


సదర్ పోలీసు నూతన అధికారి ప్రధాన్‌కు స్వాగతం పలికిన ఈశ్వర తండి


నేరాలు, దొంగతనాలు, దోపిడీలు, గంజాయి మాఫియానరు అరికట్టేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అందుకు పోలీసు సిబ్బంది అంతా దృఢ సంకల్పంతో పనిచేయాలని పిలుపు నిచ్చారు.


బాధ్యతలు స్వీకరించిన ప్రధాన్‌కు స్వాగతం పలుకుతున్న పోలీసు సిబ్బంది

పెట్రోలింగ్ వ్యవస్థను బోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. జయపురం పట్టణ, సదర్ పోలీసులు పరస్పరం సహకరించుకొని మాఫియాలు, నేరగాళ్ల ఆటకట్టిస్తామన్నారు.

పీసీఎంఏ ఎన్నికలకు నామినేషన్లు

కాశీబుగ్గ: పలాస కాష్యూ మ్యానుఫాక్చర్ అసోసియేషన్ (పీసీఎంఏ) నూతన కార్యవర్గ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. పలాసలో ఉన్నటువంటి పీసీఎంఏ కార్యాలయంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. కాగా బుధవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. అధ్యక్ష పదవికి పూర్వపు అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావు, కార్యదర్శి స్థానానికి టంకాల రవిశంకర గుప్తా, చుండూరు మహేశ్వరరావు, కోశాధికారి స్థానానికి సిందిరి సతీష్‌కుమార్‌లు నామినేషన్ దాఖలు చేశారు. 28వ తేదీన నామినేషన్ల విత్‌డ్రాకు అవకాశం ఉంటుంది. మార్చి 4వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు.


నామినేషన్ వేస్తున్న సభ్యులు

గంజాయితో ముగ్గురు అరెస్టు

పాతపట్నం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు పాతపట్నం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి బుధవారం సాయంత్రం వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లి జిల్లాకు చెందిన మోహన్‌రాజ్ పరిమళ్, శక్తివేల్ కృష్ణన్, గౌతం సెంథిల్ కుమార్‌లు ఒడిశాలోని మునిగుడలో ఒక దివ్యాంగుడి వద్ద 20.085 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని 11 ప్యాకెట్లుగా తయారుచేసి మూడు బ్యాగుల్లో సర్దారు. అనంతరం గంజాయిని పాతపట్నం మీదుగా తరలించేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చారు. అయితే ఎస్ఐ బి.లావణ్యకు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు ఉదయం 11 గంటల సమయంలో కాంప్లెక్స్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పాతపట్నం సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి అభినందించారు.

వేధింపులు తాళలేకే..!

శ్రీకాకుళం క్రైమ్: నిత్యం మద్యం సేవించి ఇంటికొచ్చి వేధించడమే కాకుండా, అక్రమ సంబంధాన్ని అంటగట్టడంతో పాటు పిల్లలను సైతం కొట్టడంతో భరించలేకే తన భర్తను చున్నీతో మెడకు చుట్టేసి చంపేశానని మజ్జి శశి అనే వివాహిత పోలీసుల ముందు ఒప్పుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల జిల్లా కేంద్రంలోని బలగ టీ ఏజెంట్ కాలనీలో మజ్జి రమేష్ (35) అనే యువకుడు తన అద్దె ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందిన సంగతి పాఠకులకు విధితమే. విచారణాధికారిగా ఉన్న రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి రెండు రోజుల్లోనే ఛేదించారు. దీనికి సంబంధించి వివరాలను శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద బుధవారం మధ్యాహ్నం తమ కార్యాలయంలో వెల్లడించారు.

జరిగింది ఇదీ...

బలగ హడ్కో కాలనీ సమీప టీ ఏజెంట్ కాలనీలో నివాసముంటున్న రమేష్ స్క్రాప్ షాపులో పనిచేస్తుండేవాడు. ఇతనికి ఒడిశాలోని రాయగడ జిల్లా బిసింగిటక్ మండలం దుకుము గ్రామానికి చెందిన శశితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 12 ఏళ్ల పాప జ్యోత్స్న, పదేళ్ల బాబు వెంకటసాయి ఉన్నారు. రమేష్ మద్యానికి బానిసై నిత్యం భార్యను అనుమానించి, గొడవపడి చిత్రహింసలకు గురిచేసేవాడు. దీంతో ఆమె ఇదివరకే పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే పెద్దలు, ఇరుపక్కల కుటుంబసభ్యులు రాజీ కుదర్చడం చేసేవారు. కాగా ఈనెల 24వ తేదీన ఉదయం రమేష్ హడ్కో కాలనీలో ఉంటున్న తన తల్లి వద్దకు వెళ్లి కొంత డబ్బులు, బియ్యం తీసుకుని మద్యం సేవించి ఇంటికొచ్చాడు. వచ్చీరావడంతోనే పిల్లలను అకారణంగా కొట్టడంతో భార్య శశి అడ్డుకుని పిల్లలేం తప్పు చేశారంటూ నిలదీసింది. దీంతో ఆమెను కొట్టడం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద, పక్కనే సీఐ ఈశ్వరరావు


ఆరంభించాడు. అక్కడికి కాసేపయ్యాక పిల్లలు స్కూలుకు వెళ్లిపోవడంతో భర్త చిత్రహింసలకు విసిగిపోయిన శశి, చున్నీతో మెడను చుట్టి గట్టిగా లాగేయడంతో రమేష్ ప్రాణాలు విడిచాడు. అనంతరం కేసు నుంచి తప్పించుకునే ప్రయత్నంలో అత్త విజయ వద్దకు వెళ్లి తలుపులు ఎంత తీయమన్నా తీయడం లేదంటూ తెలిపింది. ఆమెను వెంటబెట్టుకు వచ్చి సైడ్ తలుపులు తీసి లోపలికి వెళ్లి చూపించింది. అయితే కొడుకు చనిపోవడాన్ని చూసి కోడలే చంపేసి ఉంటుందన్న అనుమానాన్ని పోలీసుల ముందు చెప్పడంతో సీఐ ఈశ్వరరావు, క్లూస్ టీమ్ సహాయంతో మృతదేహాన్ని పరిశీలించారు. మెడ భాగంలో ఎరుపు మచ్చలా ఉండటం పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. మంగళవారం వచ్చిన పోస్టుమార్టం నివేదికలో మెడను గట్టిగా అదిమినట్లు ఉందని రావడంతో హత్యగానే నిర్ధారించి నిందితురాలైన శశిని విచారించగా మధ్యవర్తుల సమక్షంలో నిజం ఒప్పుకుంది. దీంతో కేసును రెండు రోజుల్లోనే ఛేదించిన విచారణాధికారి రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు, హెచ్‌సీ ఎస్.శివాజీ, పీసీ బి.రమేష్, మహిళా పీసీ జి.ఢిల్లీశ్వరిని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ప్రశంసించారు.

మహేంద్రం.. జనసంద్రం

మహా శివరాత్రి పర్వదిన పురస్కరించుకొని మహేంద్రగిరి జనసంద్రమైంది. బుధవారం అర్ధరాత్రి నుంచే కొండపై పంచాక్షరి మంత్రం మార్మోగింది. ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు పూజలు చేసేందుకు తరలి వెళ్లారు. ఇక్కడ పంచ పాండవుల ఆలయాలు, కుంతి ఆలయాన్ని భక్తులు సందర్శించారు. ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం యాత్రికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

– మందస/కాశీబుగ్గ





క్లుప్తంగా

పోలీసుల అదుపులో చీటీల మోసగాళ్లు

భోగాపురం: మండల కేంద్రం భోగాపురంలో కొన్ని సంవత్సరాలుగా చీటీలు, చిన్నచిన్న ల్యాండ్ వ్యాపారాలు చేసుకుంటూ భార్యాభర్తలు తిరుమరెడ్డి మురళి, తులసి కుటుంబంతో జీవనం సాగిస్తున్నారు. ఇలా జీవనం సాఫీగా సాగిపోతున్న సమయంలో గడిచిన రెండు నెలలుగా చీటీదారులకు, అప్పులు ఇచ్చిన వారికి సమాధానం చెప్పకుండా ఊరిలోనూ కనిపించకుండా బయట తిరుగుతున్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దాదాపు రూ.30కోట్లు నష్టపోయామని బాధితులు పోలీసులు ముందు వాపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులు తిరుమరెడ్డి మురళి, తులసిలను రాజమహేంద్రవరంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి నుంచి తగరపువలస ఉన్న ఇంటితో పాటు, భోగాపురంలో ఉన్న రెండు ఇళ్లు,, కొన్ని రకాల ల్యాండ్‌కు సంబధించిన రికార్డులను స్వాధీనం చేకుసుకున్నారు. అనంతరం విజయనగరం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు సీఐ ఎన్‌వీ ప్రభాకర్ బుధవారం తెలిపారు.

వంగరలో అగ్నిప్రమాదం


మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వంగర: మండల కేంద్రం వంగరలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన కర్రి రాములు గడ్డివాము దగ్ధం కాగా దేవకివాడ రామినాయుడు, రైతు అసిరినాయుడులకు చెందిన జీడి, మామిడి చెట్లు ఆహుతయ్యాయి. సమాచారం మేరకు రాజాం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిన ఇల్లు


కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న రాజాం ఫైర్ ఆఫీసర్ టి.మోహనరావు

వంగర: మండల పరిధి కింజంగి గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఒక పెంకుటిల్లు కాలిపోయింది. బుధవారం గ్రామానికి చెందిన గంట లక్ష్మి ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు రాజాం ఫైర్ ఆఫీసర్ టి.మోహనరావు ఆధ్వర్యంలో అగ్నిమాపక శకటంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో నగదు కొంత కాలిపోయిందని బాధితురాలు గంట లక్ష్మి అధికారులకు తెలిపింది. ఈ ఘటనలో రూ.2లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని వీఆర్‌వో గెడ్డాపు శ్రీనివాసరావు వెల్లడించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు


మద్యం సీసాలతో ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

బొబ్బిలి: తెర్లాం మండలం కుసుమూరులో 14 మద్యం సీసాలతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు విలేకరులకు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 48 గంటల పాటు మద్యం విక్రయాలు నిషేధించామని, అయినా ఇతర ప్రాంతాల్లో మద్యం విక్రయాలను చేపడుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా మద్యం సీసాలతో దొరికితే అరెస్టు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విజయసాగర దుర్గా మల్లేశ్వరస్వామి ఊరేగింపు


విద్యుత్ అలంకరణలతో గుర్రాలపై ఆశీనులైన స్వామివారు

విజయనగరం టౌన్: స్థానిక పెద్దచెరువు గట్టు వద్ద కొలువుదీరిన విజయసాగర దుర్గామల్లేశ్వర స్వామి వారు మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని పురవీధుల్లో ఊరేగి భక్తులను ఆశీర్వదించారు. హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కొండబాబు నేతృత్వంలో గుర్రాల రథాలపై స్వామివారిని కొలువుదీర్చి, భాజాభజంత్రీలతో, మేళతాళాలతో, భజన కీర్తనలతో ఊరేగింపు నిర్వహించారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి



- టెన్త్‌లో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- గిరిజనుల అభివృద్ధికి చర్యలు
- 'సాక్షి'తో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

సాక్షి, పార్వతీపురం మన్యం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని.. ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధ పెట్టి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను బట్టి ఏ, బీ, సీ, డీలుగా విభజించి, వారిలో విద్యాసైపుణ్యాన్ని మెరుగుపరిచేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. ప్రధానంగా చదువులో సీ, డీ గ్రేడ్‌ల్లో ఉన్నవారిపై దృష్టి సారించి, ఉత్తీర్ణత మార్కులు సాధించేలా బోధన సాగిస్తున్నామన్నారు. ప్రత్యేక తరగతులను తనతో పాటు కలెక్టర్, ఇతర అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. ఐటీడీఏ పరిధిలో చేపడుతున్న పలు అంశాలపై ఆయన వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

- గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పీఎం జన్‌మన్ పథకం కింద చర్యలు తీసుకుంటున్నాం. మొత్తం 1,450 గ్రామాలుంటే.. అందులో 416 పీవీటీజీ గ్రామాలున్నాయి. వీటిలో పీఎం జన్‌మన్ పథకం కింద తాగునీరు, గృహనిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు, పీఎం సూర్యఘర్ కింద సోలార్ పవర్ ఏర్పాటు చేసుకునేలా చైతన్యవంతం చేస్తున్నాం. డీఏ – జేజీ వీఏ(ధర్తీ ఆబా జన్‌జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్) పథకం కింద ప్రతిపాదనలు పంపుతున్నాం. ఇందులో భాగంగా పక్కా ఇళ్లు, నీటి సరఫరా, కమ్యూనిటీ కుళాయిలు, విద్యుత్, మొబైల్ మెడికల్ యూనిట్లు, ఆయుష్మాన్ కార్డులు వంటి సౌకర్యాలు కలగనున్నాయి.
- ఆర్టికల్ 275(1) పనుల కింద షెడ్యూల్డ్ తెగల గ్రామాల్లో రక్షిత తాగునీరు, రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్తు, గృహ నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధానమిస్తున్నాం. గోకులం షెడ్లు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలనూ త్వరితగతిన పూర్తి చేయాలని చెబుతున్నాం.
- పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 54 వన్‌ధన్ వికాస కేంద్రాలు (వీడీవీకే) ఉన్నాయి. ఇందులో 300 మంది వరకు సభ్యులుగా ఉంటారు. గిరిజనులు పండించిన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకింగ్, బ్రాండింగ్ కల్పించి అదనపు ఆదాయం వచ్చేలా చేయాలన్న ముఖ్య ఉద్దేశంతోనే ఈ వీడీవీకేలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాలకు రూ.4 కోట్ల వరకు నిధులు మంజూరుకాగా, ఇందులో సుమారు రూ.40 లక్షల వరకు వెచ్చించి ఎనిమిది చింతపండు కేకు మిషన్లు, రెండు మిల్లెట్ ప్రాసెసింగ్ మిషన్లు, రెండు పసుపు పిండి తయారు చేసే మిషన్లు కొనుగోలు చేశాం. సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇస్తున్నాం.
- ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు ఢిల్లీలో ఆదివాసీ మహోత్సవం జరుగుతోంది. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో మన వీడీవీకేల తరపున రెండు వెళ్లాయి. మిల్లెట్స్, బిస్కెట్స్, కొండ చీపుర్లు స్టాల్స్‌ను మనవాళ్లు ప్రదర్శనలో ఉంచారు.
- పార్వతీపురం ఏఎంసీలో జీడి ప్రాసెసింగ్ యూనిట్ తుది దశకు చేరుకుంది. ఏప్రిల్ మొదటి వారానికి సిద్ధం కానుంది.

ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక శ్రద్ధ


ఆర్.కృష్ణవేణి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు

ఆశ్రమ, ఏకలవ్య పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు కలెక్టర్, పీవో ఆదేశాలతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఐటీడీఏ పరిధిలోని విద్యాలయాల్లో సన్నద్ధత తీరును ఆమె 'సాక్షి'కి వివరించారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 40 ఆశ్రమ పాఠశాలలు ఉండగా 1,518 మంది.. జోగింపేట, కురుపాం, భద్రగిరి, పి.కోనవలస, కొమరాడ, భద్రగిరి(బాలురు) తదితర ఆరు గురుకులాల్లో 415 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. వీరందరికీ మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభం కాగా... ఈఎంఆర్ ఎస్కు సంబంధించి 211 మంది సీబీఎస్ఈ విద్యార్థులకు ఈ నెల 15 నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయని వివరించారు. మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాగా.. ఏపీఆర్‌జేసీ మొదటి సంవత్సరం 675 మంది, ద్వితీయ సంవత్సరం 660 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

సిలబస్ పూర్తి..

పదోతరగతి, ఇంటర్మీడియట్‌కు సంబంధించిన సిలబస్ మొత్తం పూర్తి అయ్యిందని ఆమె తెలిపారు. పదిలో రివిజన్ కూడా పూర్తి అయ్యిందని, ప్రీ ఫైనల్ పరీక్షలు కూడా పెట్టి వారిలో పరీక్షలు అంటే భయం పోగొట్టేలా సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. వెనుకబడిన వారిపై మరింత శ్రద్ధ చూపి ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నామని చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్యంపైనా దృష్టి..

విద్యార్థుల ఆరోగ్యంపైనా పీవో ఆదేశాలతో ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలతో పాటు.. పాలు, గుడ్లు అదనంగా ఇస్తున్నామని చెప్పారు.

పోలింగ్ ఏర్పాట్లు పరిశీలించిన జేసీ


సిబ్బందికి సూచనలు ఇస్తున్న జేసీ సేతు మాధవన్

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ బుధవారం పరిశీలించారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎనిమిది మండలాలకు సంబంధించిన పోలింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదం, గుర్ల, రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాల్లో ఎన్నికల నిర్వహణకు నియమించిన పోలింగ్ సిబ్బందికి కిట్లను ఆర్డీఓ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. సజావుగా పోలింగ్ నిర్వహణ జరగాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

అవయవదానానికి అంగీకారం

- ముందడుగు వేసిన వెదుళ్లవలస యువత

చీపురుపల్లి రూరల్ (గరివిడి): వారంతా చదువుకున్న యువత. ఉన్నతంగా ఆలోచించారు. అవయవదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. మరణాంతరం తమ శరీర అవయవాలు బూడిదలో కలిసిపోకూడదని, ఈ సమాజంలో అవయవాల లోపంతో జీవిస్తున్న మరెంతోమందికి తమ మరణాంతరం తమ అవయవాలతో మంచి జరగాలనే సంకల్పంతో అవయవదానం చేసేందుకు అంగీకరించారు. ఈ మేరకు చీపురుపల్లి పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బీవీ.గోవిందరాజులు గ్రామానికి వెళ్లి అవయవదాన ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ అవయవదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఈ మేరకు గ్రామానికి చెందిన 120 మంది యువత, గ్రామస్తులు అవయవదానానికి అంగీకారం తెలుపుతూ అంగీకార పత్రాలపై సంతకాలు చేసి మానవీయత సంస్థ వ్యవస్థాపకుడు బీవీ.గోవిందరాజులుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామయువత, పెద్దలు తలాడ సుబ్బలక్ష్మి, పెనుమత్స సాంబమూర్తిరాజు, గుడివాడ నారాయణరావు, పిల్ల నారాయణరావు, కోన పైడినాయుడు, బార్నాల సూరప్పలనాయుడు, శనపతి అప్పలనాయుడు, గుడివాడ శ్రీరాంనాయుడు, జమ్మాన తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.


అవయవదాన అంగీకార పత్రాలను మానవీయతాసంస్థకు అందజేస్తున్న యువత, గ్రామస్తులు

రెండు కేసులు నమోదు

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామానికి చెందిన కొప్పుశెట్టి కోటేశ్వరరావు, పలిశెట్టి శీతయ్యలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేయడంతో 5గురు వ్యక్తులపై రెండు కేసులు నమోదు చేశామని హెచ్‌సీ వంజరాపు జనార్దనరావు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ..కొప్పుశెట్టి కోటేశ్వరరావు పొలంలో సర్వే మొక్కలను పలిశెట్టి శీతయ్యకు చెందిన నాటు బండ్లు కుమ్మేయడంతో గొడవ జరిగింది. పలిశెట్టి శీతయ్య, లక్ష్మణరావు, గోవిందలు తనపై దాడి చేశారని కొప్పుశెట్టి కోటేశ్వరరావు.. కొప్పుశెట్టి కోటేశ్వరరావు, శ్రీనులు తమపై దాడి చేశారని పలిశెట్టి శీతయ్య ఫిర్యాదు చేయడంతో పరస్పర ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేశామని వెల్లడించారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో.. మహాశివరాత్రి వేడుకలు


భక్తులను ఆకట్టుకున్న శివలింగాల ప్రదర్శన


అద్దాల అలంకరణలో మహాశివలింగాలు


విద్యుత్ అలంకరణలో కంటోన్మెంట్ బ్రహ్మకుమారీస్ కేంద్రం

విజయనగరం టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కంటోన్మెంట్‌లో ఉన్న బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. అద్దాలతో అలంకరణ చేసిన శివలింగాల ప్రదర్శన భక్తి భావాన్ని పెంపొందించింది. భారతదేశంలో ఉన్న జ్యోతిర్లింగాలను ఆయా స్థానాల్లో ఏర్పాటుచేసి, వాటి విశిష్టతను బ్రహ్మకుమారీలు వివరించారు. బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జ్ బీకే. అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో బ్రహ్మకుమారీలు, భక్తులు పాల్గొన్నారు.

ఆదాయ లక్ష్య సాధనలో వెనుకబాటు

- మార్కెట్ కమిటీల లక్ష్యం రూ.12.89 కోట్లు
- ఈనెల10 నాటికి సాధించింది రూ.7.41కోట్లు



విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

ఈ నెల 10వరకు సాధించిన ఆదాయ వివరాలు:

మార్కెట్ కమిటీ పేరు	సాధించిన లక్ష్యం (రూ.లక్షల్లో)
విజయనగరం	రూ.80.45
బొబ్బిలి	రూ.180.23
గజపతినగరం	రూ. 78.79
చీపురుపల్లి	రూ.83.59
కొత్తవలస	రూ.83.63
పూసపాటిరేగ	రూ.140.72
మెరకముడిదాం	రూ.18.18
రాజాం	రూ. 76.18

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లు ఆదాయ లక్ష్య సాధనలో వెనుకబడ్డాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్ష్య సాధనకు గడువు తక్కువ కాలమే ఉండడంతో మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని సాధించడం అంత తేలిక కాదని తెలుస్తోంది. నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని సాధించగలిగితే వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో రైతుబజార్లు, వ్యవసాయ చెక్‌పోస్టులు ఉంటాయి. వాటి నిర్వహణ, కార్యకలాపాలు వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలోనే జరుగుతాయి.

జిల్లాలో 8 మార్కెట్ కమిటీలు

జిల్లాలో 8 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, రాజాం, పూసపాటిరేగ, కొత్తవలస, చీపురుపల్లి, మెరకముడిదాంల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వాటి పరిధిలో 12 వ్యవసాయ చెక్‌పోస్టులు ఉన్నాయి.

ఆదాయ లక్ష్యం రూ. 12.89 కోట్లు

వ్యవసాయ మార్కెట్ కమిటీలకు 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆదాయ లక్ష్యం రూ.12.89 కోట్లు. ఈ నెల 10 వతేదీ నాటికి వ్యవసాయ మార్కెట్ కమిటీలు సాధించిన ఆదాయం రూ.7.41 కోట్లు ఇంకా రూ. 5.48 కోట్లు ఆదాయం సాధించాల్సి ఉంది. మార్చి నెలాఖరు లోగా ఈ లక్ష్యాన్ని సాధించాలి. వ్యవసాయ చెక్‌పోస్టులు, గోదాములు, వ్యాపార లావాదేవీల ద్వారా ఆదాయం వస్తుంది. వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర సామగ్రిని తరలించే వాహనాల నుంచి రుసుమును వ్యవసాయ చెక్ పోస్టుల వద్ద సిబ్బంది వసూలు చేస్తారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఉన్న షాపుల నుంచి సెస్‌లు, మార్కెట్ కమిటీల్లో జరిగే వ్యాపారలావాదేవీల ద్వారా, వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సంబంధించి గొడాముల అద్దె ద్వారా మార్కెట్ కమిటీలకు ఆదాయం వస్తుంది.

శతశాతం సాధించేందుకు కృషి

జిల్లాలో ఇప్పటివరకు వ్యవసాయ మార్కెట్ కమిటీలు రూ.7.41 కోట్ల ఆదాయాన్ని సాధించాయి. ఇంకా రూ. 5.48 కోట్లు సాధించాల్సి ఉంది. మార్చి నెలాఖరు వరకు సమయం ఉన్నందున శతశాతం ఆదాయ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తాం.

బి.రవికిరణ్, మార్కెటింగ్‌శాఖ ఎ.డి

ఆ పాదముద్రలు పులి పిల్లలవి కాదు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): అవి పులి పిల్లల పాదముద్రలు కాదని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుబ్బారావు స్పష్టంచేశారు. గరివిడి మండలం శివరాం గ్రామంలోని ఓ రైతు పొలంలో పులి పిల్లల పాదముద్రలు కనిపించాయన్న వార్తతో గ్రామస్తులు భయాందోళన చెందారు. తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజుతో పాటు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో తహసీల్దార్, ఆర్‌ఐ అచ్యుతరావు, ఫారెస్టు రేంజ్ అధికారి కలిసి పాదముద్రలను పరిశీలించారు. అవి పులి పిల్లలవి కాదని, వేరే జాతి జంతువుల పిల్లల అడుగులుగా నిర్ధారించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


సోములు (ఫైల్)

బొబ్బిలి: పట్టణంలోని కొత్త ఎరుకల వీధికి చెందిన గేదెల సోములు(29) మనస్తాపంతో తాను నివసిస్తున్న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్ రమేష్ విలేకరులకు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం తరచూ తనను ఎవరూ ఖాతరు చేయడం లేదని సోములు విసుక్కుంటూ తనలో తానే మాట్లాడుకుంటూ తిట్టుకుండే వాడు. ఈ క్రమంలో మంగళవారం ఇద్దరు పిలలు, భార్యతో కలిసి శంబర పండగకు వెళ్లారు. అక్కడ దర్శనం సమయంలో కాస్తా ఆలస్యమైంది. ఆ సమయంలో ఎవరో త్వరగా వెళ్లమని ముందకు తోయడంతో భార్యపై చిరాకుపడ్డాడు. సోములు కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి వచ్చేసినా అదే ఆలోచనతో బాధపడ్డాడు. రాత్రి సమయంలో ఇంట్లోని మొదటి గదిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన భార్య ఇరుగుపొరుగు సాయంతో వచ్చి కిందికి దించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ తెలిపారు.

ప్రైవేట్‌కే వాహనాల ఫిట్‌నెస్..!

- గుర్ల మండలంలో ఫిట్‌నెస్ కేంద్రం ఏర్పాటు
- జిల్లాలోని కమర్షియల్ వాహనాలన్నింటికీ ఇక్కడే బ్రేక్
- కంప్యూటర్ ఓకే చేస్తేనే వాహనాలకు సర్టిఫికెట్


అచ్యుతాపురం వద్ద ఉన్న ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రం

గుర్ల: జిల్లాలోని కమర్షియల్ వాహనాలైన నాలుగు చక్రాలు, మూడు చక్రాలు, ట్రాక్టర్లు, భారీ వాహనాలకు ఫిట్‌నెస్ (బ్రేక్) ధ్రువీకరణ పత్రం గురించి ఆర్‌టీఓ కార్యాలయానికి ఇకపై వెళ్లనవసరం లేదు. ఆర్‌టీఓ కార్యాలయం వద్ద ఉన్న మధ్యవర్తులకు చెక్‌పెట్టిన ప్రభుత్వం..వాహనాలకు ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం అందించేందుకు జిల్లాలోని గుర్ల మండలం అచ్యుతాపురం వద్ద రాజస్థాన్‌కు చెందిన ప్రైవేట్ కంపెనీకి బాధ్యతలు అప్పగించింది. అచ్యుతాపురం వద్ద ఏర్పాటు చేసిన ఫిట్‌నెస్ కేంద్రానికి ఆన్‌లైన్‌లో శ్లాట్ బుక్ చేసుకున్న వాహన యాజమానులు వారికి కేటాయించిన తేదీలలో వాహనాలను తీసుకురావాల్సి ఉంటుంది. వారం రోజుల నుంచి అచ్యుతాపురం ఫిట్‌నెస్ కేంద్రం వద్దకు బ్రేక్ కోసం వాహనాలు రావడం ప్రారంభమైంది.

కంప్యూటర్ ఓకే అంటేనే

గతంలో జిల్లా కేంద్రంలోని ఆర్‌టీఓ అధికారులు ఫిట్‌నెస్ కోసం వచ్చిన వాహనాలను పూర్తిస్థాయిలో చెక్‌చేసి చిన్న చిన్న రిపేర్లు ఉంటే వాటిని వెంటనే గుర్తించి రిపేర్ చేసుకుని వచ్చిన వాహనాలకు ఫిట్‌నెస్ ధృవీకరణ పత్రం అందజేసేవారు. ఇప్పుడు మాత్రం ఫిట్‌నెస్ ధృవీకరణ పత్రం కోసం వచ్చిన వాహన యజమానులు శ్లాట్ బుక్ చేసుకుని రావాలి. వాహనాలు ఏ మాత్రం కండిషన్ లేకపోయినా, చిన్న చిన్న రిపేర్లను కంప్యూటర్ గుర్తించినా వారి శ్లాట్ రద్దవుతుంది. పూర్తి కండిషన్‌లో ఉన్న వాహనాలకు మరుసటి రోజు ఫిట్‌నెస్‌గా ఉందా? లేదా? అనేది తెలుస్తుంది. ఆన్‌లైన్‌లో మాత్రమే ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంది.

ఆర్‌టీఓలకు సంబంధం లేదు

వాహనాలకు ఫిట్‌నెస్ కోసం ప్రైవేట్ సంస్థకు అప్పగించినట్లు తెలిసింది. ఆ సంస్థ ఏ విధంగా వాహనాలకు ఫిట్‌నెస్ తనిఖీ చేస్తుందో సమాచారం లేదు. ఫిట్‌నెస్ తనిఖీలు చేస్తున్న సంస్థ కూడా ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదు. ప్రభుత్వ ఆదేశాలనుసారం మా విధులు నిర్వహిస్తాం.

దుర్గాప్రసాద్, ఆర్‌టీఓ, విజయనగరం

పకడ్బందీగా చదువు ప్రణాళిక

వంగర: జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో ఈ ఏడాది పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉమ్మడి విజయనగరం గురుకులాల సమన్వయకర్త శంబాన రూపవతి అన్నారు. 100 రోజుల చదువు ప్రణాళికను పకడ్బందీగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. వంగర మండలం మడ్డువలసలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. తొలుత వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యత తనిఖీ చేశారు. బాలికలతో కలిసి భోజనం చేశారు. అనంతరం డార్మిటరీ, తరగతి గదులు, క్రీడామైదానం పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై బోధన ప్రణాళిక అమలుతీరుపై ఆరా తీశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో నీట్, ఐఐటీ, ఎంసెట్ వంటి పోటీపరీక్షలకు ప్రత్యేక తర్ఫీదునిస్తామని తెలిపారు. కేఎల్‌వైఈఎస్ విధానంలో గురుకుల విద్యార్థులకు విదేశీ విద్యను అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వంగర, ఉంగరాడమెట్ట గురుకులాల ప్రిన్సిపాల్స్ సాన పద్మజ, పేడాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బాలికలతో కలిసి భోజనం చేస్తున్న గురుకులాల జిల్లా సమన్వయకర్త రూపవతి